క్లుప్తంగా

గ్రంథాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న సెక్రటరీ ప్రకాశ్

వెల్దుర్తి: మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయాభివృద్ధి సంస్థ సెక్రటరీ ప్రకాశ్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి గ్రంథాలయాధికారి కవితాబాయి వివరాలు ఆరా తీశారు. అనంతరం పాఠకుల తో మాట్లాడారు. నూతన భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం దగ్ధం


దగ్ధమైన ద్విచక్ర వాహనం

పత్తికొండ రూరల్: స్థానిక బైపాస్‌రోడ్డు మలకలకుంటలో దగ్ధమైన ద్విచక్రవాహనం శనివారం లభ్యమైంది. మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామానికి చెందిన రాముడుకు చెందిన బైక్‌గా గుర్తించినట్లు సీఐ మురళీ మోహన్ తెలిపారు. బైక్‌కు ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకోవడంతో అక్కడే పడేసి వెళ్లినట్లు బాధితుడు చెప్పినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా శవాసప్పతాత ఉరుసు


దర్గా పూజల్లో పాల్గొన్న భక్తులు

తుగ్గలి: చెన్నంపల్లిలో వెలసిన హజరత్ శవాసప్పతాత ఉరుసును శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామ శివారులోని కోటపై ఉన్న స్వామి దర్గాను కుల మతాలకతీతంగా సందర్శించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి షంషేర్ ఊరేగింపు ఉంటుందని దర్గా నిర్వాహకులు ఉసేన్‌పీరా, లక్ష్మన్న తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆస్పరి విద్యార్థిని


విద్యార్థినితో ఉపాధ్యాయులు

ఆస్పరి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని వైష్ణవి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఆనందరాజు తెలిపారు. శనివారం హెచ్‌ఎం సునీత, సర్పంచ్ మూలింటి రాధమ్మ, పేరెంట్స్ మేనేజ్‌మెంట్ చైర్మన్ చైర్మన్ గోవర్ధన, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. గత నెలలో కర్నూలులో జరిగిన అండర్ -17 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో వైష్ణవి ప్రతిభ కనబరిచి ఈనెల 23 నుంచి 26 వ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ చెప్పారు.

సామాజిక తనిఖీకి సహకరించాలి


మాట్లాడుతున్న ఎస్‌ఆర్పీ మూర్తి

నందవరం: ఉపాధి పనులపై ఆదివారం నుంచి జరగనున్న సామాజిక తనిఖీకి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సహకరించాలని ఎస్‌ఆర్పీ మూర్తి సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు, ఉపాధి పనులు, పింఛన్లు, పీఆర్ పనులపై సంబంధిత శాఖల సిబ్బంది రికార్డులు చూపించి తనిఖీ సిబ్బందికి సహకరించాలన్నారు. సమావేశంలో పీఆర్ ఏఈ జయన్న, ఏపీఓ మాలిక్‌బాషా పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

తుగ్గలి: స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఎంపీ రూరల్ ఫోక్‌ఆర్ట్ ఆర్గనైజేషన్ కర్నూలు కళాజాతా బృందం చేత ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకు ద్వారా అందుబాటులో ఉన్న సేవలు, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం, మెసేజ్ అలర్ట్ వంటి సేవల గురించి ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ సీహెచ్ మురళి వివరించారు. బ్యాంకు ఇన్సూరెన్స్, ప్రధానమంత్రి జీవన జ్యోతి, బీమా యోజన, సురక్ష బీమా యోజన వంటి పథకాల ఆవశ్యకతను కళాజాతా బృందం వివరించింది. కార్యక్రమంలో వైకేపీ సిబ్బంది ఆంజనేయులు, శీను, పొదుపు మహిళలు ఉన్నారు.

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తాం

● ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి


అయ్యకొండ గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అయ్యకొండ గ్రామంలో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. అయ్యకొండ నుంచి కడిమెట్లకు వెళ్లేందుకు రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరగా.. ఎమ్మెల్యే స్పందిస్తూ అయ్యకొండ, గంజిహళ్లి గ్రామాల ప్రజల శ్రేయస్సు కోసం అయ్యకొండ సమీపంలోని ఎల్లెల్సీ కాలువపై రూ.40 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే అయ్యకొండ నుంచి కడిమెట్ల, ఎర్రకోట, ఎమ్మిగనూరు తదితర గ్రామాలకు రవాణా సులభవుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. నవరత్న పథకాలు ప్రవేశపెట్టి ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు చేర్చారన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు గంజిహళ్లి తిరుమల రెడ్డి, ధర్మకారి నాగేశ్వరరావు, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం శక్తితో ఎదగాలి


టీ తాగుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: చదువుకున్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కలేదని పెడదారిపట్టకుండా ముందుగా స్వయంశక్తితో ఎదిగేందుకు ప్రయత్నిస్తే ప్రతి ఫలం దక్కుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం యువతీ, యువకులకు సూచించారు. దేవనకొండ మండలం కర్నూలు టర్నింగ్ పాయింట్ వద్ద నిర్వహిస్తున్న టీ కొట్టుపై ఆయన ఆరా తీశారు. ఇద్దరు స్నేహితులు ఏర్పాటు చేసిన టీ కొట్టులో 15 రకాల మధురమైన టీని అందిస్తుండటం పట్ల అభినందించారు. అక్కడ ఆయనతో పాటు పార్టీ నాయకులు టీ తాగి, నిర్వాహకులకు స్వయంగా మంత్రి డబ్బును అందించారు.

రోడ్డుకు మరమ్మతులు


గరుసు వేసి బాగు చేసిన పొలాల రోడ్డు

ఆస్పరి: మండల కేంద్రంలో సమీపంలోని రైల్వే గేట్ వద్ద ఉన్న రైతులు పొలాలకు వెళ్లేందురు రోడ్డు సరిగా లేక ఇబ్బందిపడేవారు. ఇదే విషయాన్ని రైతులు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లడంతో 1.80 కిలో మీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ.4.90లక్షల జెడ్పీ నిధులు మంజూరు చేశారు. దీంతో ముళ్ల కంపలు తొలగించి, గరుసు వేసి రోడ్ రోలర్‌తో గట్టి పరిచి బాగు చేశామని రైతులు ఏఈ యమునప్ప తెలిపారు.

సచివాలయంలో ఆధార్ సేవలు



గోనెగండ్ల: మండల పరిధిలోని ఐరన్‌బండ, నెరుడుప్పల గ్రామాల్లో శనివారం ఆధార్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కొత్త ఆధార్ కార్డు నమోదు, ఆధార్ ఈకేవైసీ, ఆధార్ మార్పులు, చేర్పులు వంటివి నమోదు చేశారు.

మల్లెపల్లెలో 'పల్లె నిద్ర'

వెల్దుర్తి: మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామంలో స్థానిక పోలీసులు శనివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. రచ్చకట్ల వద్ద ప్రజలతో సమావేశమై ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదన్నారు. ఏ చిన్న సమస్య ఎదురైనా తమను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

వ్యవసాయ పనిముట్ల పంపిణీ

హొళగుంద: ప్రభుత్వం నుంచి మంజూరైన వ్యవసాయ పనిముట్లను శనివారం అధికారులు రైతులకు అందించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముద్దటమాగి గ్రామానికి చెందిన భీరలింగేశ్వర రైతు సంఘానికి రూ.15 లక్షల విలువ చేసే ట్రాక్టరు, కల్టివేటర్, లెవెల్ బ్లేడ్, టిల్లర్ తదితర పనిముట్లను గ్రూపు కో కన్వీనర్ గాదిలింగ అందజేశారు. కార్యక్రమంలో ఆలూరు కేడీసీసీ బ్యాంకు సిబ్బంది ఇమ్మాన్యుయేల్ పాల్గొన్నారు.

'న్యాయబద్ధంగానే కొన్నాం'

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలో మైనార్టీ కాలనీ సమీపంలో ఉప్పర నరసమ్మ కుమారుడు మోహన్‌కృష్ణ భూమిని అతని వద్ద ఉన్న రెవెన్యూ రికార్డుల ఆధారంగానే కొనుగోలు చేశామని కడిమెట్ల విరుపాక్షిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక శిల్పా కార్యాలయంలో మోహన్‌కృష్ణతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము ఏ రాజకీయ పార్టీలో లేమన్నారు. రికార్డులు సక్రమంగా ఉండటంతోనే ప్రస్తుత తహసీల్దార్ జయన్న పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేశారన్నారు.

ఇంటింటికీ తాగునీటి కుళాయి

నందవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన జలజీవన్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేస్తామని సర్పంచ్ లక్ష్మి, ప్రాజెక్టు సమన్వయకర్త భీమశంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని నాగలదిన్నెలో ఐఎస్‌ఏ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్‌పై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో కో- ఆప్షన్ మెంబర్ షేక్ అహమ్మద్, ఎంపీటీసీలు అత్తావుల్లా, యల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

లారీలు ఢీ

● రాకపోకలకు అంతరాయం


లింగాల బ్రిడ్జిపై ఢీకొన్న లారీలు

తుగ్గలి: గిరిగెట్ల సమీపంలోని లింగాల బ్రిడ్జిపై శనివారం సాయంత్రం ఎదురెదురుగా వెళ్తున్న రెండు లారీలు ఢీకొనడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గుత్తి నుంచి ఆదోని వెళ్తున్న లారీ పత్తికొండ నుంచి గుత్తి వెళ్తున్న లారీలు బ్రిడ్జిపై ఢీకొనడంతో రెండు గంటలకు పైగా రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చిన్న వాహనాలు పగిడిరాయి మీదుగా వెళ్లగా భారీ వాహనాలు నిలిచిపోయాయి. తుగ్గలి పోలీసులు బ్రిడ్జిపై ఇరుకున్న లారీలను తొలగించి రాకపోకలు సాగేలా చర్యలు తీసుకున్నారు.

ముత్తుకూరులో ఘర్షణ

● ఆరుగురికి గాయాలు


హనుమంతు,


లలితమ్మ


వెంకటేష్

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో శుక్రవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. వివరాలను శనివారం ఆలూరు సీఐ ఈశ్వరయ్య విలేకరులకు వెల్లడించారు. ముత్తుకూరు గ్రామానికి చెందిన లక్ష్మన్న, వెంకటేష్ కుటుంబాల మధ్య పొలం రాస్తా విషయంలో మనస్పర్థలున్నాయి. ఇదే విషయమై శుక్రవారం రాత్రి ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో వెంకటేష్, హనుమంతు, లలితమ్మ, నాగలక్ష్మి, లక్ష్మన్న, బీరప్ప గాయపడడంతో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఇరువర్గాలకు చెందిన ఈరన్న, లక్ష్మన్న, బీరప్ప, అశోక్, సోమన్న, సంజమ్మ, అంజినమ్మ, వెంకటేష్, హనుమంతు, చంద్ర, సురేంద్ర, నాగలక్ష్మి, లలితమ్మలపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

26న మారెమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ

ఆలూరు: దేవనకొండ మండలం పి.కోటకొండలో ఈనెల 26న మారెమ్మవ్వ విగ్రహం ప్రతిష్ఠ ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాడెద్దుల చోరీ


చోరీకి గురైన కాడెద్దులు (ఫైల్)

వెల్దుర్తి: మండల పరిధిలోని బొమ్మిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన రైతు అల్లిసాహెబ్ కాడెద్దులు చోరీకి గురయ్యాయి. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు.. రైతు అల్లిసాహెబ్ రూ.70వేల విలువ చేసే తన కాడెద్దులను శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే జాతీయరహదారి పక్కనున్న తన కల్లంలో ఉంచాడు. శనివారం తెల్లవారుజామున వచ్చి చూడగా ఎద్దులు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు

ఎమ్మిగనూరు రూరల్: భూ కబ్జాల సందర్భంగా బెదిరింపులకు పాల్పడే వారిపై ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ బి.మధుసూదన్‌రావు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మైనార్టీ కాలనీ సమీపంలో భూ వివాదంలో అన్నదమ్ములు రాజేష్, రమేష్‌లు పొలంలో పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయంలో బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన


పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని శివన్న నగర్ సమీపంలో జగనన్న కాలనీని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శనివారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ తిలక్ ఉన్నారు.

● నందవరం: జగనన్న కాలనీలలోని గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. శనివారం మండల పరిధిలోని మాచాపురంలో సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం గృహ నిర్మాణాలను పరిశీలించారు. రోడ్లు, డ్రైయినేజీలు, విద్యుత్ దీపాలు, నీటి వసతి తదితర సదుపాయాలు కల్పిస్తున్న విషయాలను లబ్ధిదారుల దృష్టికి తీసుకెళ్లి ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకునేలా చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటేశ్వరరావు, సత్యన్న, గాలెన్న పాల్గొన్నారు.

● చిప్పగిరి: మండలంలోని రామదుర్గం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహాలను తహసీల్దారు లక్ష్మీనారాయణతో కలిసి స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు శనివారం పరిశీలించారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, సమయపాలన పాటించాలని సిబ్బందిని ఆదేశించారు.

'గోరుముద్ద' అమలులో నిర్లక్ష్యం వద్దు


గుడెంపాడులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్

కృష్ణగిరి: జగనన్న గోరుముద్ద పథకం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ మోహన్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని అమకతాడు జెడ్పీ, గుడెంపాడు ప్రాథమిక పాఠశాలల్లో శనివారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన అమకతాడు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సరిపడా భోజనం చేయకపోగా మెనూ పాటించడంలో నిర్లక్ష్యం వహించడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోమారు ఇలా జరిగితే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. అనంతరం ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి చంద్రకళ ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మిగనూరు రూరల్: పోషక విలువలుండే ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ, డాక్టర్ అపర్ణలు సూచించారు. శనివారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో 'చిరుధాన్యాలలో విలువలు జోడింపు' అంశంపై అంగన్‌వాడీ టీచర్లు, పొదుపు సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు.

వీరన్న గట్టు చెరువులో చేపల పెంపకానికి అనుమతి

వెల్దుర్తి: స్థానిక వీరన్న గట్టు చెరువులో చేపల పెంపకానికి పట్టణానికి చెందిన మాసపోగు జమ్మన్నకు అనుమతి ఇచ్చినట్లు వెల్దుర్తి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అబ్దుల్ కలాం తెలిపారు. శనివా రం ఆయన మాట్లాడుతూ గత నెల 27న కర్నూ లు రేంజ్ కార్యాలయంలో జరిగిన వేలంలో జమ్మన్న రూ.2,47,500ల హెచ్చువేలానికి పాడి దక్కించుకుని, మొత్తం పైకం శనివారం చెల్లించాడన్నారు. దీంతో జిల్లా అధికారులు ఏడాది పాటు చేపలు పెంచుకునేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు ఎఫ్‌బీఓ తెలిపారు.

వలంటీర్లపై దుష్ప్రచారం తగదు

చిప్పగిరి: నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై అసత్య కథనాలు ప్రచురించడం తగదని ఎంపీపీ జూటూరు హేమలత ఖండించారు. శనివారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జూటూరు మారయ్య పాల్గొన్నారు.

నేడు గ్రంథాలయ అభివృద్ధిపై సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాల అభివృద్ధి-ప్రజల భాగస్వామ్యం అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం ఉంటుందని గ్రంథాలయాధికారి హరికృష్ణ శనివారం తెలిపారు.

5న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

తుగ్గలి: 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి నేషనల్ మీన్స్ మెరిట్(ఎన్‌ఎంఎంఎస్) స్కాలర్‌షిప్ పరీక్ష వచ్చేనెల 5న జరగనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. హాల్ టికెట్లు వెబ్‌సైట్ www. bre.ap.gov.in స్కూల్ లాగిన్‌లో ఉన్నాయని, సంబంధిత హెచ్‌ఎంలు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అంద జేయాలన్నారు.

టెన్త్ తాత్కాలిక స్కీమ్ గడువు పెంపు

తుగ్గలి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు తాత్కాలిక స్కీమ్ కింద ఫీజు చెల్లించేందుకు గడువు పొడిగించినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రూ.500 అపరాధ రుసుంతో ఈనెల 23వ తేదీ వరకు, రూ.1,000 అపరాధ రుసుంతో 27వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు.

నిత్యాన్నదాన సేవలో ఈఓఆర్డీ

వెల్దుర్తి: స్థానిక జర్నలిస్ట్ కాలనీలోని వేకటేశ్వర, అయ్యప్ప, సాయినాథ ఆలయ సమూహంలో కొనసాగుతున్న నిత్యాన్నదాన సేవలో శనివారం ఈఓఆర్డీ నరసింహులు పాల్గొన్నారు. తన వంతు విరాళం అందించి పేదలకు అన్నదానం చేశారు. అంతకుముందు ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, కమిటీ ప్రతినిధులు సత్కరించారు.

వ్యాస రచన పోటీలు

ఆలూరు రూరల్: ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, వెంకటేశ్వర ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోటీలను ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ గాయత్రీ పర్యవేక్షించారు. విజేతలకు ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు.

28న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో తాత లాలుస్వామి ఉరుసు సందర్భంగా ఈనెల 28 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద వరుసగా రూ.15,016, రూ.10,016లు, రూ.5,016 నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27లోపు 9177316956, 6281600641 సంప్రదించి ఎంట్రీఫీజు రూ.500లు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

గోనెగండ్ల: ఈనెల 23న మండల కేంద్రంలోని శ్రీ కాశీ నీలకంఠేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కుర్ని దైవాచార సంఘం, ఆలయ భజన బృందం సభ్యులు శనివారం తెలిపారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు


ఎల్లార్తిలో షేక్షావలి దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

పత్తికొండ రూరల్: పత్తికొండ-కర్నూలు రోడ్డులో కొలువైన శ్రీఅభయాంజనేయస్వామి శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలందుకున్నారు. స్వామివారికి అర్చకుడు రవి జలాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ఆంజనేయదండకం పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు దేదీప్యమానంగా వెలుగొందారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.


పత్తికొండలో పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

● హొళగుంద: మండలంలోని దేవరగట్టు క్షేత్రంలో వెలసిన మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో విరాట్ మూర్తులకు శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు మూల విరాట్‌కు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణ తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామానికి చెందిన నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు. హొళగుంద సిద్దేశ్వర స్వామి, సాయిబాబా మందిరం, ఎల్లార్తి షేక్‌షావలి, షాషావలి దర్గాలు, హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, ఫాతెహాలు చేశారు.

● మద్దికెర: స్థానిక సుబ్రహ్మణ్యస్వామి, మద్దమాంబ దేవి ఆలయాల్లో అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తర నామార్చన, అభిషేకం, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

బాల్యవివాహాలు అరికడదాం


మాట్లాడుతున్న సీడీపీఓ సఫర్నీసాబేగం

ఎమ్మిగనూరు రూరల్: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సీడీపీఓ సఫర్నీసాబేగం అన్నారు. శనివారం మండల పరిధిలోని గుడేకల్ జిల్లా పరిషత్ పాఠశాలలో బేటీ బచావ్- బేటీ పడావ్ కార్యక్రమంలో భాగంగా బాలికలకు హక్కులపై అవగాహన కల్పించారు. చిన్నతనంలోనే వివాహాలు చేసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలకు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, ఏమైనా సమస్యలుంటే మొహమాటపడకుండా తల్లి, ఉపాధ్యాయినులకు, ఆరోగ్య కార్యకర్త దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం బసప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నీలమ్మ, విజయ కుమారి పాల్గొన్నారు.